

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి  ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన  ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**నేను పొద్దున లేచేసరికి** కిటికీ బ్లైండ్స్ తెరిచి ఉన్నాయి. అది పొద్దున కాదని అర్థమైంది. ఎంతో కష్టపడితే కళ్ళు పూర్తిగా తెరవగలిగాను. బయట అంతా స్నోతో నిండి తెల్లగా ఉంది. దాన్ని మీద సూర్య రశ్మి పడి దగదగా మెరిసింది. నేను బయటకి వెళ్ళి చూసేసరికి అందరూ మంచులో ఆడుకుంటున్నారు.

"నువ్వు కూడా రా" హనీష పిలిచింది.

"వద్దు బాగా చలిగా ఉంది" గ్లౌస్ వేసుకున్న చేతుల్ని జేబులో పెట్టుకున్నాను.

"ఏం కాదు, అలవాటైపోతుంది" అభిషేక్ అన్నాడు.

"వద్దు, వద్దు" ఇంతలో పక్కనుండి దీపిక స్నోతో కొట్టింది. రెండు క్షణాలపాటు లోపలికి వెళ్ళిపోదాం అనుకున్నాను కానీ నా మీదపడ్డ స్నో ఇంటిని తడి చేస్తుందని దులుపుకుందాం అనుకుంటుండగానే మరో స్నో దెబ్బ తగిలింది. ఆ తరవాత వర్షంలా కురిసాయి, నేనూ వాళ్ళతో కలిసి ఆడడం మొదలు పెట్టాను. ఎంతో సరదాగా అటూ ఇటూ పరుగెడుతుంటూ, నవ్వుతూ, ఒకరి మీద ఒకరు స్నో విసురుతూ, అవి తగలకుండా తప్పించుకున్నాము. అంతా అలిసిపోయాక స్నో మాన్ చేద్దాం అనుకున్నాము. ఎవరు పెద్దది చేస్తారో చూద్దామని పందెం కట్టాము. ఎలా చెయ్యాలో తెలీక నేను మృదుల స్నోని దగ్గరికి చేర్చి బీచ్‌లో ఫోర్ట్ కట్టినట్టు ప్రారంభించాము. ఇంతలో హనీష చేరి "ఛీ ఇలా కాదు" అని మా కష్టాన్ని చేత్తో కూల్చేసింది. స్నోని ఒక చిన్న బాల్‌గా చేసి, దాన్ని కింద దొర్లించింది. అది పెద్దగా అవుతుండగా నేను, మృదుల కూడా సహాయం చేసాము.

"చిన్న పిల్లలు రోడ్డు మీద టైర్‌తో ఆడినట్టుంది" మృదుల అంది.

నేను పట్టలేక గట్టిగా నవ్వేసాను. మేం ముగ్గురం నవ్వడం చూసి చుట్టు పక్కలవాళ్ళు కూడా నవ్వడం మొదలు పెట్టారు. ఇంతలో ఎవరో ఒక కుక్కని తీసుకుని వాకింగ్‌కి వచ్చారు. మమ్మల్ని చూసి కసురుకుని వెళ్ళిపోయారు. దాంతో మరింత నవ్వాము.

"పాపం ఆ కుక్కని ఇంత చలిలో కూడా బయటికి తేవాలా?" అన్నాను.

"కుక్కలకి బొచ్చు ఉంటుంది కాబట్టి చలి పెద్దగా తెలియదు" హనీష అంది.

"కానీ ఇక్కడి వాళ్ళు కుక్కలకి కూడా బట్టలు వేస్తారు కదా. పాపం దానికి వెయ్యాల్సింది" అన్నాను.

మృదుల మా ఇద్దరిని 'పిచ్చిపట్టిందా' అని మాట మార్చేసింది. ఎంతో కష్టపడి అటూ ఇటూ తిప్పి మొత్తానికి మా స్నోమేన్‌ని అతి కష్టం మీద పూర్తి చేసాము. మిగిలినవారు కూడా అదే స్థాయిలో ఉన్నారు. పూజ వాళ్ళు నాలాగే స్నోని పేర్చి అష్టకష్టాలు పడ్డారు. ఆ తరవాత మేము స్నోమేన్‌ని అలంకరించసాగాము. కళ్ళకి రెండు గింజలు, నోరుకి ఎమ్ అండ్ ఎమ్ పెట్టాము. ఇంట్లో క్యారెట్ లేకపోయేసరికి ముక్కుకి మరో గింజ పెట్టాము. ఎదురింటి వాళ్ళు స్కార్ఫ్ వెయ్యడం చూసి మేము కూడా స్కార్ఫ్ వేసాము. అలానే ఒక హేట్ కూడా పెట్టాము. ఇంతలో స్నోమేన్‌కి ఐబ్రోస్ వేద్దాం అంటూ హనీష ఐ లైనర్ తెచ్చింది .అది చలికి గడ్డకట్టి పోవడం వల్ల చేత్తో సీసాని వేడి చేస్తూ ప్రయత్నించింది కానీ మా స్నోమన్ చంద్రముఖిలా మారాడు. దాంతో మరికొంతసేపు నవ్వుకుని చివరికి స్నోమాన్‌కి కళ్ళజోడు పెట్టాము.

"అందరివీ చూద్దాం" హనీష అంది.

కొంత మందివి నిజంగా బావున్నాయి. దాదాపు నా హైట్‌వి కూడా ఉన్నాయి. కొంతమంది మాత్రం అసలదేంటో అర్ధంకాకుండా విచిత్రంగా తయారు చేసారు. అందరం నాది బావుందంటే నాది బావుందంటూ గొడవపడ్డాము. అంతా

పూర్తై ఇంటికి వెళ్ళేసరికి ఆకలి తెలిసింది. గబగబా ఓ గ్లాసు అన్నం వండి ఉత్తపప్పు, ఆవకాయ, పెరుగు తిన్నాను. ఆ తరవాత ఒక కునుకు వేద్దాం అనుకున్నాను. కానీ లేచేసరికి మర్నాడు ఉదయం అయింది.

వెంటనే తయారయ్యి వేగంగా లాబ్‌కి వెళ్ళాను. ఆలస్యమైంది కానీ ప్రొఫెసర్ ఇంకా రాలేదు. నేను వెళ్ళి రెయిన్‌తో ఆలస్యం ఎందుకు అయ్యిందని చెబుతుండగా ప్రొఫెసర్ వచ్చారు. ఇద్దరం నిశ్శబ్దమైపోయాము.

"హాలీడేస్ ఎలా అయ్యాయి, అదీ ఇదీ అని అడిగారు. నేను కట్టె కొట్టె తెచ్చె అన్నట్టు సమాధానాలు ఇచ్చాను. కానీ రెయిన్ చాలా వివరంగా బదులిచ్చింది.

"డిడ్ యూ ఎంజాయ్ టర్కీ?" అడిగారు.

రెయిన్ 'యస్' అని బదులిచ్చింది, నేను తలూపాను. ఆయన లోపలికి వెళ్ళి ఏదో పని చేయసాగారు.

"డిడ్ యు ఈట్ టర్కీ" రెయిన్ ఆశ్చర్యపోయింది.

"నో. ఐ యాం వెజిటేరియన్" అన్నాను.

"ఓ..ఓకే" నవ్వింది.

"ఐ డిడ్ నాట్ అండర్ స్టాండ్ వాట్ హి ఆస్క్‌డ్" అన్నాను.

తనకే కొన్నిసార్లు అర్థం కాదని చెప్పింది. అలా మా సంభాషణ కొనసాగింది. ప్రొఫెసర్ వచ్చి ఏదో అడగడంతో రెయిన్ వెళ్ళి ఎక్స్‌ప్లెయిన్  చేయసాగింది. వాళ్ళు తన ప్రాజెక్ట్ గురించి చర్చించుకుంటుండగా నాకు ఆకలి మొదలైంది. వాళ్ళ చర్చ పూర్తయ్యాక నాదే వంతు. అందుకని నేను తయారు చేసిన స్లైడ్స్ తెరిచి వాటిల్లో కొన్ని మార్పులు, కొన్ని చేర్పులు చేసాను. త్వరగా ఆయనకి వాటిని చూపించి వెళ్ళి తిందాం అనుకున్నాను కానీ అది జరగలేదు. ఆయనకి నా ఐడియాని చెప్తుండగా ఎన్నో ప్రశ్నలు అడిగారు. గబుక్కున అయిపోతుంది అనుకున్నది ఓ గంటదాటింది. నెక్స్ట్ సెమిస్టర్ ఏం క్లాసులు తీసుకుంటున్నావు అని అడిగారు కానీ నా దగ్గర సరైన సమాధానం లేక కిందకి చూసాను. ఆయన కొన్ని చెప్పి అవి తీసుకుంటే ఈ ప్రాజెక్ట్‌కి కూడా సహాయపడుతుందని చెప్పారు. అలాగే తీసుకుంటానన్నాను.

"కీప్ వర్కింగ్ ఆన్ యువర్ స్లైడ్స్ అండ్ సెండ్‌మి ఎ కాపీ" అని వెళ్ళిపోయారు.

హమ్మయ్య అని ఊపిరి పీల్చాను.

"ఇట్ వజ్ గుడ్" రెయిన్ నన్ను టెన్షన్ పడకు అన్న విధంగా చూస్తూ చెప్పింది. ఇద్దరం మళ్ళీ ప్రెజంటేషన్ల గురించి, క్లాసుల గురించి మాట్లాడుకుంటుండగా ఆకలి గుర్తొచ్చింది.

"ఐ యాం హంగ్రీ. ఐ విల్ గో ఈట్" అన్నాను.

"ఐ విల్ జాయిన్" అని తను అనడంతో ఇద్దరం కలిసి కెఫెటేరియాకి వెళ్ళాము. దారిలో నిన్నటి మంచు కరిగి ఐస్‌గా మారింది.

"బీ కేర్ ఫుల్" రెయిన్ అంది.

ఆ చలిలో గడ్డ కట్టిన ఐస్ మీద వెళుతూ దాదాపు పడబోయిన సైకిల్‌ని ఇద్దరం చూసాం. రెయిన్ పెద్దగా అరిచింది. అతను పడకపోయేసరికి నిరుత్సాహపడింది. అది గమనించి నేను నవ్వాను.

"ఐ థాట్ హీ వుడ్ ఫాల్" అంది.

ఇంకా నవ్వాను.

"ఐ వజ్ స్కేర్డ్" అంది. దాంతో నవ్వు ఆపాను.

అసలు స్నో ఎందుకు పడుతుందో, కేవలం ఇబ్బంది కలిగించడానికి కాకపోతే అని వాపోయింది. ప్రకృతిలో ప్రతీది ఏదో ఒక ఉపయోగానికే ఉంటాయి అన్నాను.

'స్నో వల్ల ఏం లాభాలుంటాయి? మరీ అంటే నీళ్ళగా వాడచ్చుకానీ ఇలాంటి సిటీలలో స్నోని నీళ్ళగా ఎవరూ ఉపయోగించరు కదా' అంది.

'మనం నీళ్ళగా వాడకపోయినా ఏదో ఒక ఉపయోగమైతే ఉంటుంది' అన్నాను.

ఈ చర్చ వాదనగా మారేట్టు అనిపించడంతో గూగుల్ చేసి చూద్దాం అని ఇద్దరం ఫోన్‌లో వెదికాము. తను చెప్పినట్టే స్నోవల్ల ఉపయోగాలు ఏమీలేవు. నేను ఎంతో ఆశ్చర్యపోయి "ఐకాంట్ బిలీవ్ ఇట్. దెన్ వై డజ్ ఇట్ స్నో?" అడిగాను.

తను నవ్వి నా ప్రశ్న కూడా అదే అంది.

కెఫెటేరియాలో పిజ్జా తీసుకుని స్నో గురించి చర్చ ముగించాము. నిన్నటి స్నోమేన్‌ల ఫోటోలు చూపించి హనీష ఐ లైనర్ కథ చెప్పాను. ఆ ఫోటో చూసి పైరేట్ లాగా ఉన్నాడని నవ్వింది. మేము ఎమ్ అండ్ ఎమ్ తో స్నో మేన్‌కి చిరునవ్వు పెట్టినట్టు వాళ్ళు రంగు రంగులవి గోళ్ళలాగా పెట్టే వాళ్ళని చెప్పింది. ఆ ఐడియా భలే ఉందనుకున్నాను.

తినడం పూర్తయ్యాక మా ట్రిప్ గురించి చెప్తూ లాబ్‌కి బయలుదేరాము. అక్కడి హైకింగ్, ఆ ప్రదేశాలు, జరిగిన సంఘటనలు, తన ప్రశ్నలు అన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం మూడైంది. దాంతో క్లాస్‌కి వెళుతున్నా అని తను వెళ్ళిపోయింది. నేను ప్రొఫెసర్ చెప్పిన కోర్సుల గురించి వెతకసాగాను. అన్నీ ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. అలానే అన్నీ భయంకరంగా కూడా ఉన్నాయి. ఎవరి సలహా అయినా తీసుకుందాం అని అనుకున్నాను.

ఇంతలో హనీష మెసేజ్ చేసి 'సినిమాకి వెళదమా' అని అడిగింది.

ఆ కోర్సుల పేర్లకి హడలిపోయేసరికి 'లేదు, చదవాలి' అన్నాను.

సరే అని బదులిచ్చింది. నేను నెమ్మదిగా పవర్‌పాయింట్ స్లైడ్స్‌ని సరిచేసి రూముకి బయలుదేరాను. వెళ్ళిన వెంటనే నేహ నా ట్రిప్ గురించి అడిగింది. దాంతో రాత్రయేంతదాకా ఆ కబుర్లలో మళ్ళీ మునిగిపోయాను. తనకి కూడా

స్నోమాన్‌ల ఫోటోలు చూపించాను. రెయిన్ చెప్పిన గోళ్ళ సంగతి చెప్పాను. ఎమ్ అండ్ ఎమ్స్ ని చొక్కా గుండీలలా కూడా పెట్టాల్సింది అని మరో సలహా ఇచ్చింది. ఈసారి స్నో పడినప్పుడు మేమిద్దరం కలిసి ఓ అందమైన స్నోమాన్‌ని తయారు చేయాలని నిశ్చయించుకున్నాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story